క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి



శ్రీనివాస్‌రెడ్డికి బొకే అందజేస్తున్న కేశవరెడ్డి తదితరులు

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం నగరంలో ఘనంగా జరుపుకొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో నేతలు హైదరాబాద్ వెళ్లి శ్రీనివాస్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నా పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రతి ఇంటి పరిసరాల్లో విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ప్రతి పల్లె పచ్చదనంతో వెల్లివిరియాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



విజయారెడ్డి

మాడ్గుల: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలిగా ఇటిక్యాల విజయారెడ్డిని నియమించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు జయమ్మ చేతుల మీదుగా విజయారెడ్డి నియామకపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ మిత్ర మండలి వ్యవస్థాపకులు సంపత్ కుమార్ పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని గృహ, వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులను ఏప్రిల్ 30వ తేదీ లోపు చెల్లించినట్లయితే పన్నుపై 5 శాతం మినహాయింపు ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంబంధిత బిల్ కలెక్టర్లకు కానీ.. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో గానీ పన్ను చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేడుకలో పాల్గొన్న భక్తులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గోదా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వట్టిపల్లి రామశర్మ తదితరులు కల్యాణం, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. రాత్రి రథోత్సవాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉన్ని వెంకటయ్య, సోలిపేట అమరేందర్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, చందా భాస్కర్, సోలిపేట రంగారెడ్డి, బాణాల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలనకు నిదర్శనం కాంగ్రెస్

చేవెళ్ల: ప్రజాపాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మున్సిపల్ నాయకులు ఎంపీని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఎంపీగా మరోసారి గెలిపించేందుకు కృషి చేస్తామని చెప్పారు. శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, మండల నాయకులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ నేత పల్లె ఆనంద్ తన తల్లిదండ్రులు పద్మమ్మ, వెంకటయ్యల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లె ఆనంద్ మాట్లాడుతూ.. పదేళ్లుగా వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, అనసూయమ్మ, రాజు, మల్లేశ్‌గౌడ్, సంతోష్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

అవిశ్వాసాల పర్వం



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

- మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరిపై అవిశ్వాస ఓటింగ్‌కు ముహూర్తం ఖరారు
- మున్సిపల్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం
- ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీఓ అనంతరెడ్డి
- ఫిబ్రవరిలో వీగిపోయిన చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై పెట్టిన అవిశ్వాసానికి ముహూర్తం ఖరారైంది. మున్సిపాలిటీ పరిధిలోని 24 మందికిగాను 16 మంది కౌన్సిలర్లు గతనెల 11న జిల్లా అధికారులకు అవిశ్వాస నోటీసులను అందజేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం అవిశ్వాస ఓటింగ్‌ను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. అవిశ్వాస ఓటింగ్ ప్రక్రియకు ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీఓ అనంతరెడ్డి వ్యవహరించనున్నారు. అయితే గత ఫిబ్రవరి 16వ తేదీన చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి(కాంగ్రెస్)పై బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా బీఆర్ఎస్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై జరుగనున్న అవిశ్వాస ప్రక్రియ వీగిపోతుందా లేక నెగ్గుతుందా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

క్యాంపుల్లో కౌన్సిలర్లు..

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పలువురు కౌన్సిలర్లు వరుసగా క్యాంపు రాజకీయాల్లోనే తలమునకలై ఉన్నారు. ఇదివరకు మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై అవిశ్వాసం పెట్టినప్పటి నుంచే వారు క్యాంపుల్లో ఉన్నారు. ఆ తదుపరి కొద్ది రోజులకే మెజార్టీ కౌన్సిలర్లు ఏకమై వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై అవిశ్వాసానికి సిద్ధమవ్వడం, జిల్లా అధికారులకు నోటీసులు ఇవ్వడం అన్నీ చకచకా జరిగిపోయాయి.

క్యాంపుల ఖర్చు ఎవరిది..?

ఎవరైతే వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారో వారే క్యాంపులకు సంబంధించి పైసలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. మొదట్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి తన పదవిని కాపాడుకునేందుకు ఒకవైపు.. ఆమెను గద్దె దించేందుకు ప్రత్యర్థులు మరోవైపు నలక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి క్యాంపు రాజకీయాలు నడిపించారు. తాజాగా వైస్ చైర్మన్ ఆకులను గద్దె దించితే.... ఆ స్థానాన్ని ఓ కౌన్సిలర్ దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. వైస్ చైర్మన్‌ను గద్దె దించిన వెంటనే ఆ స్థానాన్ని భర్తీ చేయరు. నూతన వైస్‌చైర్మన్ ఎన్నికకు మరో తేదీని ప్రకటిస్తూ అధికారులు ఆదేశాలు జారి చేయాల్సివుంటుంది. అంతవరకు మళ్లీ కౌన్సిలర్లు క్యాంపులకు తరలివెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. 2024 నూతన సంవత్సరం ప్రారంభం నుంచి కౌన్సిలర్లకు కలిసివస్తుంటే.. చైర్మన్, వైస్ చైర్మన్లకు మాత్రం పదవి కాపాడుకోవడం గగనంగా మారింది. గురువారం జరిగే అవిశ్వాస ఓటింగ్ ఎటువైపు మల్లుతుందో అని స్థానికంగా ఒకటే చర్చ జరుగుతోంది.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులతో ఎస్ఐ రవినాయక్, నిర్వాహకులు

ఎస్ఐ రవినాయక్

మంచాల: క్రీడల్లో గెలుపోటములు సహజం అని.. వాటిని సమానంగా స్వీకరించాలని మంచాల ఎస్ఐ రవినాయక్ అన్నారు. మండల పరిధిలో ఆరుట్లలో గత కొన్నిరోజులుగా నిర్వహించిన ఆరుట్ల ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలు సోమవారంతో ముగిశాయి. గెలుపొందినవారికి ఎస్ఐ రవినాయక్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిరూ.30వేలు థండర్స్ జట్టు, ద్వితీయ బహుమతి రూ.20వేలు ఆరుట్ల లెజెండ్ జట్టు, తృతీయ బహుమతి రూ.15వేలు ఆరుట్ల పవర్ హిట్టర్ జట్టు, నాల్గవ బహుమతి రూ.10వేలు ఆరుట్ల టైటాన్స్ జట్టు గెలుచుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, రమేష, మాజీ ఉప సర్పంచ్ జంగయ్య గౌడ్, వివిధ జట్ల ఆర్గనైజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమావేశానికి తరలిరండి

పార్టీ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: భువనగిరి పట్టణంలో బుధవారం బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజవకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి టీ.హరీష్‌రావు హాజరుకానున్నారని.. నియోజకవర్గంలోని మున్సిపల్, మండల, గ్రామ, బూత్ స్థాయి పార్టీ శ్రేణులందరూ పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ రోడ్డు వద్దకు ఉదయం 9 గంటల్లోపు చేరుకోవాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌తో కలిసి భువనగిరిలో నిర్వహించే సమావేశానికి తరలివెళ్లనున్నట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ బాధ్యతల స్వీకరణ



నూతన సభ్యులను సన్మానించిన అతిథులు

ఆమనగల్లు: ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప గారు నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జగన్, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ రామకష్ణ, లైబ్రరీ సెక్రటరీ శేఖర్, ట్రెజరర్ మధు, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ్ శర్మ, రాములు, వెంకటేశ్వర రావు, యాదిలాల్, న్యాయవాదులు.. సంతోష్, గణేష్, జగన్, శ్రీనివాస్, కృష్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యలపై ఫిర్యాదు చేయండి

మున్సిపల్ కమిషనర్లు సత్యనారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి


తుర్కయంజాల్: నీటిఎద్దడి రానివ్వకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే మున్సిపల్ మేనేజర్ జి.శ్రీధర్‌రెడ్డి ఫోన్ నంబర్ 98485 70399, జలమండలి శాఖ మేనేజర్ వినయ్ (91548 66705), మున్సిపల్ ఏఈ మల్లిఖార్జున గౌడ్ (95020 25421), డీఈఈ సత్యనారయణ (99592 62844), కమిషనర్ సత్యనారయణరెడ్డి (77990 11775)నుసంప్రదించాలని సూచించారు.

అందుబాటులో అధికారులు..

అబ్దుల్లాపూర్‌మెట్: వేసవిని దృష్టిలో పెట్టుకుని పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నీటి సరఫరాలో ఎలాంటి సమస్య వచ్చినా మున్సిపల్ అధికారులు, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు 24గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన తెలపారు. మున్సిపల్ పరిధిలో నీటి సమస్యలు వస్తే హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ భగవంత రావు(79950 10496), డిప్యూటీ జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్ వర్మ(99899 89580), మున్సిపల్ ఇంజనీర్ అశోక్ కుమార్ (94408 68304), మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి (9030413639)ను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- గొడవలు సృష్టిస్తే సహించేది లేదు
- ఇప్పటికే రౌడీ షీటర్ల బైండోవర్
- వెపన్స్ డిపాజిట్ చేయించాము
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజుతో ప్రత్యేక ఇంటర్వ్యూ



SAKSHI INTERVIEW సాక్షి

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రాజకీయ పార్టీల నాయకులే బాధ్యత తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవంటున్న ఏసీపీతో స్పెషల్ ఇంటర్వ్యూ మీకోసం..

ప్రశ్న: లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఎన్నికల విషయమై ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీల నాయకులతో అనేక సమావేశాలు నిర్వహించాం. అధికారులతో సమీక్ష నిర్వహించాం.

ప్రశ్న: ఇప్పటివరకు ఎంత నగదు పట్టుబడింది?

జవాబు: ఇప్పటివరకు ఎక్కడా కూడ నగదు పట్టుబడలేదు. ఎస్ఎస్‌టీ–6 టీంలు, ఎఫ్ఎస్‌టీ–6 టీంలు నిరంతరం పనిచేస్తున్నాయి. వారితో పాటు మా పోలీసులు కూడా పనిచేస్తున్నారు.

ప్రశ్న: గన్స్ డిపాజిట్ చేసుకున్నారా.. మన ప్రాంతంలో ఎన్ని ఆయుధాలు ఉన్నాయి?

జవాబు: ఇబ్రహీంపట్నం డివిజన్‌లో మొత్తం 51 మంది గన్ లైసెన్స్‌లు కల్గి ఉన్నారు. 52 వెపన్స్ (ఆయుధాలు)ఉన్నాయి. వీరిలో రాజకీయ నాయకులు, మాజీ ఆర్మీ, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు ఇతరులు రక్షణ కోసం ఎస్‌బీఎంఎల్, డీబీఎంఎల్ ఆయుధాలు వాడుతున్నారు. 5 మంది బ్యాంకు ఉద్యోగులకు అనుమతి ఇచ్చాం. మిగతావి అన్నీ డిపాజిట్ చేయించాము.

ప్రశ్న: రౌడీ షీటర్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

జవాబు: మన డివిజన్‌లో 56 మంది రౌడీషీటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వారిని బైండోవర్ చేశాం. మళ్లీ కొంతమందిని బైండోవర్ చేస్తాం.

ప్రశ్న: బెల్టు షాపులపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టు షాపులపై ప్రతి నిత్యం నిఘా పెడుతున్నాం. ఇప్పటి వరకు 55 కేసులు నమోదు చేశాం. రూ.78వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశాం.

ప్రశ్న: మాదక ద్రవ్యాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: కొద్ది రోజులుగా ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల పోలీస్ స్టేషన్లల్లో డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. పూర్తిస్థాయిలో వీటిని అరికడతాం.

ప్రశ్న: రాజకీయ నాయకులకు ఎన్నికల ముందు మీరిచ్చే సలహా?

జవాబు: రాజకీయ నాయకులు ఎన్నికల కోడ్ నిబంధనలు తప్పక పాటించాలి. ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. వ్యక్తిగత విమర్శలు చేయవద్దు. ఓటర్లను ప్రలోభ పెట్టరాదు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆమనగల్లు: ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు



తలకొండపల్లి: విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో సోమవారం శ్రీ సురమాంబ సహిత కంఠ మహేశ్వర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆకుతోటపల్లి సంఘం ఆధ్వర్యంలో నవీన్ శర్మ అర్చక బృందంతో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారయణ రెడ్డి, సినీ నటుడు నరేష, డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, జెడ్పీటీసీలు ఉప్పల వెంకటేశ్, దశరథ్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

శివసీతారామాంజనేయ స్వామి ఆలయంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతలలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ శివసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు కొనసాగుతున్నాయి. సోమవారం ప్రత్యేక పూజల అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలకుమార్‌గౌడ్, నరోత్తంరెడ్డి, మాజీ సర్పంచ్ రఘుపతి, రాకేశ్, కుమార్‌గౌడ్, యాదయ్య, మహేష్, పరమేష్, వెంకటయ్యగౌడ్, నగేశ్, యాదయ్య, కృష్ణయ్య, గిరి, రామచంద్రయ్య, జనార్దన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి, చిన్నారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రాజిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలి..

కడ్తాల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మైసిగండిలోని తుల్జాభవానీ ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు సోమవారం ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టిసారించండి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల్‌లో నేనావత్ శివ ఏర్పాటు చేసిన ఎంటర్‌ప్రైజెస్‌ను స్థానిక నాయకులతో కలిసి జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా.. స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా విరివిగా రుణ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్లు వీరయ్య, సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్, రాములునాయక్, తులసిరాం నాయక్, సాయిలు, నాయకులు నర్సింహ, పాండు, భీమన్, శంకర్, రాజు, ప్రేమ్, ప్రశాంత్, శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఓపెన్ జోన్ స్థలం విషయంలో ధర్నా

కాలనీ స్థలాన్ని అప్పగించాలని ఫిర్యాదు



ధర్నా నిర్వహిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో ఓపెన్ జోన్ విషయంలో ఎంసీఆర్ కాలనీకి చెందినవారు సర్వేనెంబర్ 139లోని 700 గజాల స్థలం తమదేనని సోమవారం ధర్నా చేశారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు వెంకటరమణ, నర్సింహా, సురేశ్, అరుణ్, వివేక్ తదితరులు మాట్లాడారు. కాలనీ ఏర్పడినప్పుడు ఆ స్థలం కాలనీకి చెందినగా లేఅవుట్‌లో చూపించారు. ఇప్పుడేమో ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. అధికారులు స్పందించి ఈ విషయంలో తగిన న్యాయం చేయాలని కోరారు. వెంటనే ఆ స్థలాన్ని కాలనీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొనుగోలుదారులు మాట్లాడుతూ లీగల్‌గానే ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు, దానికి ఎల్ఆర్ఎస్ కూడా కట్టి కొత్త మునిసిపల్ యాక్ట్ ప్రకారం అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నామని బదులిచ్చారు. కాబట్టి ఈ స్థలం విషయంలో కాలనీకి ఎటువంటి సంబంధం లేదని, కావాలనే రచ్చ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు.

కంపు కొడుతోంది



మార్కెట్ యార్డు పక్కన పడేసిన కూరగాయలు, చెత్త

ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు పక్కన కుళ్లిపోయిన కూరగాయలతోపాటు చెత్తను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా పడేస్తున్నా.. అడిగే నాథుడు కరువయ్యాడు. నాగార్జున సాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఈ మార్కెట్ యార్డు ఉంటుంది. మార్కెట్ గేట్ లోపలి నుంచి బృందావన్ కాలనీకి వెళ్లే రహదారిని నిర్మించారు. ఈ దారిలో నిత్యం వాహనాలు, ప్రజలు సంచరిస్తుంటారు. కుళ్లిపోయిన కూరగాయలు, చెత్త పడేస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు పక్కనే చెత్తను డంప్ చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

– ఇబ్రహీంపట్నం



ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వెళ్లేదారిలో ఓ వెంచర్ సమీపంలో రోడ్డు ప్రక్కన ఓపెన్ నాలా ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

– ఇబ్రహీంపట్నం రూరల్